తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మంచుదుప్పట్లో తిరుమల

## -వెంకన్న ఆలయంలో ఆహ్లాదకరం



మారిన వాతావరణంతో తిరుమలగిరులను మంచుదుప్పటి కప్పుకుంది. సహజంగానే కొండపై భిన్న వాతావరణం కనిపిస్తుంది. అలాంటిది కురుస్తున్న వర్షాలకు ...మారిన పూర్తి వాతావరణంలో శనివారం తెల్లవారుజామున సప్తగిరులు మంచుతో కప్పేసింది. భక్తులు పరవశం చెందుతున్నారు. ప్రభాతవార్తప్రతినిధి, తిరుమల

# ఎంతో నష్టం .. పరిహారం కొంతే

## - ఆందోళనలో రైతులు



నామమాత్రంగా ఇస్తున్న విత్తనాలు

దొరవారిసత్రం, డిసెంబర్ 16 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండల పరిధిలో వేసిన వరిపంట, వివిధ రకాల ఉద్యాన పంటలు మిచౌంగ్ తుపాను ప్రభావంతో భారీగా దెబ్బతినడం తెలిసిందే. అయితే రైతు ఒక్కో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టి వేసిన పంట పూర్తిగా దెబ్బతిన్నది. దెబ్బతిన్న పంట చాలా వరకు దెబ్బతింటే పరిహారం మాత్రం నామమాత్రంగా ఏర్పాటు చేస్తున్నారు. పంట వేసి 40 నుంచి 55 రోజులు పూర్తయింది. కాని ప్రభుత్వం మళ్లీ పంటలు వేసుకోవాలని ఉచిత సలహాలిస్తూ 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు ఇవ్వడం బాధాకరమని రైతులు వాపోతున్నారు. దొరవారిసత్రం మండలంలో వ్యవసాయ అధికారులు మాత్రం ప్రభుత్వం ఎలాంటి పరిహారం అందించలేదని, దెబ్బతిన్న పంటలకు 80 శాతం రాయితీతో విత్తనాలు మాత్రమే అందించగలమని చెప్పడంతో అన్నదాతలు దిగాలుపడుతున్నారు. ఒక్కో ఎకరాకు రూ.వెయ్యి కూడా ఇవ్వని ప్రభుత్వంపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలు వేసిన రైతులకైతే కనీసం ఆ శాఖ అధికారులు ఉన్నారా లేదా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు అంటున్నారు. ఏదిఏమైనా ప్రకృతి వైపరిత్యాలతో పంట పూర్తిగా దెబ్బతింటే స్థానిక అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని అన్నదాతల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని వాపోతున్నారు. పేరుకే నష్టపోయిన రైతులను ఆదుకుంటున్నామని ప్రకటనలు చేస్తున్నారని, ఎక్కడా కూడా ఆదుకున్న దాఖలాలు లేవని అంటున్నారు. శనివారం దొరవారిసత్రం వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద నామమాత్రంగా పలువురు రైతులకు 80శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తున్నామని ప్రచారం చేసుకున్నారు.

# సామాజిక సాధికారిత.. వైసీపీతోనే సాధ్యం..!

## సామాజిక న్యాయం,అణగారిన వర్గాల అభ్యున్నతి జగనన్న పాలనలోనే చూస్తున్నాం : డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, అంజాద్ బాషా

గంగవరం, డిసెంబరు 16, ప్రభాతవార్త :

సామాజిక సాధికారిత సాధించడం వైసీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రులు నారాయణస్వామి,అంజాద్ బాషాలు పేర్కొన్నారు. శనివారం పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో సామాజిక సాధికారిక బస్సు యాత్రను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు నారాయణస్వామి,అంజాద్‌బాషా, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరామ్,చిత్తూరు ఎంపి రెడ్డెప్ప,మాజీ మంత్రి అనిల్‌యాదవ్,ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు,డిసిసిబి ఛైర్పర్సన్ మొగసాల రెడ్డెమ్మక్రిష్ణమూర్తిలు పాల్గొన్నారు.ముందుగా గంగవరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని,స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డా.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం గంగవరం నుండి పలమనేరు పట్టణంలోని టవర్ క్లాక్ వరకు బస్సు యాత్రను నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సామాజిక సాధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తూ అందరినీ కలుపుకుపోతున్నారని,చంద్రబాబునాయుడు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం,14 సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిని అనుభవించి స్వలాభం కోసమే కృషి చేశారని,బడుగు బలహీన వర్గాలను ఆదుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాలు అభివృద్ధిలోకి వచ్చేందుకు రాజకీయ,సామాజిక,ఆర్థిక,విద్య,వైద్యం వంటి రంగాల్లో జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు,పేదపిల్లలకు,అణగారిన కుటుంబాల పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. జగనన్న వలనే ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు.గత ప్రభుత్వ పనితీరును,ఇప్పుడు ప్రభుత్వ పనితీరును ప్రతి ఒక్కరు బేరీజు వేసుకోవాలని,నాడు సంక్షేమ పథకాలు అందాలంటే ఎంతో కష్టపడాల్సి వచ్చేదని,నేడు జగనన్న పాలనలో ఇంటిచెంతకే చేరుతున్నాయన్నారు.అందరీ భవిష్యత్తు గురించి ఆలోచించే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కోరారు.మాజీ మంత్రి అనిల్‌యాదవ్ మాట్లాడుతూ జగనన్న నాయకుడుగా కాకుండా సేవకుడు అనే పంథాలో పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప,మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరీమండీసుధా,సింగిల్‌విండో అధ్యక్షుడు మోహన్‌రెడ్డి,కౌన్సిలర్‌లు మండీసుధా, కోదండరామయ్య,రవి,నియాజ్,హైదర్,ఎంపిటీసీలు లేఖ్యబాలు,భారతిమహేష్,సర్పంచులు చంద్రమ్మ,బాస్కర్‌రెడ్డి,గిరిరాజారెడ్డి,నాయకులు ప్రహల్లాద, చెంగారెడ్డి,హేమంత్‌రెడ్డి, ఆర్వీ సుభాష్‌చంద్రబోష్,



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

# తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు



చంద్రగిరి, డిశంబర్ 16 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఎస్.రాజు, అధ్యాపక సంతాన కృష్ణన్, పరిచారిక ఘనాపాటి తిరువెంగడం స్వామి, జమేధార్ జలంధర్, సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు,తిరుపతి ఎస్పీలకు డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డు



డిజిపి రాజేంద్రనాథరెడ్డి నుండి అవార్డును అందుకొంటున్న ఎస్పీలు రిశాంత్‌రెడ్డి, పరమేశ్వర రెడ్డి

చిత్తూరు, తిరుపతి క్రైం, డిసెంబర్ 16 ప్రభాతవార్త:

చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డు అందుకొన్నారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో శనివారం ఎస్పీలు రిశాంత్‌రెడ్డి, పరమేశ్వర రెడ్డిలు డిజిపి రాజేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకొన్నారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి 2022 సంవత్సరంలో శాంతి భద్రతల పరిరక్షణ, కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్, దిశ, శాంతిభద్రతల విభాగం, ఫ్రెండ్లీ పోలీసు, ముఖ్య కేసులకు సంబంధించి దర్యాప్తు కోర్టు నుండి షెడ్యూల్ మేరకు ట్రైల్ విచారణ, స్వయంగా కేసు పురోగతి సమీక్ష, నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో అత్యుత్తమ పనితీరు కనబరచడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు డిజిపి రాజేంద్రనాథరెడ్డి శనివారం మంగళగిరి పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో ఎస్పీ రిశాంత్‌రెడ్డికి అవార్డు బహుకరించారు. పరమేశ్వర రెడ్డి తిరుపతి జిల్లా ఎస్పిగా బాధ్యతలు తీసుకున్న రోజు నుండి ప్రజా సేవయే పరమావధిగా భావించి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పదం మోపారు. అంతే కాకుండా తిరుపతి కొత్త జిల్లాగా అవతరించినందున ఆ దిశగా కూడా శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఘటనలు సంభవాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

# జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు న్యాయం

## మంత్రి రోజా



నింద్ర,డిసెంబరు 16 ప్రభాతవార్త :వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా తెలిపారు. శనివారం మండలంలోని కొప్పేడు గ్రామ సచివాలయ పరిదిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథి రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా పాల్గోన్నారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పాదయాత్రలో పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దనాన్ని అన్నింటిని పూర్తి చేసిన ముఖ్యమంత్రిగా దేశంలోనే పేరు సం పాదించిన ఏకైక నాయకుడని తెలిపారు. రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని,అదే సైన్యంలో పనిచేస్తున్న నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈకార్యక్రమంలో యంపిపి దీపాజలందర్‌రాజు,యంపిడిఓ అరుణ, డిటి నాగరాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, సచివాలయ వైకాపా కన్వీనర్ బాబురెడ్డి, కో ఆప్షన్ మెంబరు అనిల్,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణా రెడ్డి, జిల్లా వైకాపా కార్యదర్శి మేరీజయరామ్, సర్పంచ్ సుబ్రమణ్యంరాజు, మేళంబాకం కన్వీనర్ మురళీరాజు,విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు,ఎపియం చంద్రకళ,యంపిటిసి విజేష్ నాయకులు దామోధరం, సింగారం, చంద్ర బాబురెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, శివలింగ ఆచ్చారి, దినకర్, నామదేవరెడ్డి,సుదాకర్,తదితరులు పాల్గోన్నారు.

# రేపు తిరుమలకు గవర్నర్ జస్టీస్ నజీర్



తిరుమల,డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులకోసం రాష్ట్ర గవర్నర్ జస్టీస్ అబ్దుల్‌నజీర్ సోమవారం తిరుమలకు వస్తున్నారు. సాయంత్రం ఆయన కొండకు చేరుకుని రచన అతిధిగృహంలో బసచేస్తారు. మంగళవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని తిరుగుప్రయాణమవుతారు. వెంకన్న దర్శనం కోసం విచ్చేస్తుండటంతో జిల్లా అధికారయంత్రాంగం, టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలు బిక్షాటన చేస్తూ నిరసన




బిక్షాటన చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త

గూడూరులో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వరనయంలో అంగన్‌వాడి కార్యకర్తల సమ్మె రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారానికి 5వ రోజుకు చేరుకుంది. బిక్షాటన కార్యక్రమం శిభిరం వద్ద నుండి ప్రదర్శనగా బయలుదేరి పాత బస్టాండ్, టవర్ క్లాక్ సెంటర్, గాంధీ మున్సిపాలిటీ బిల్డింగ్, ముత్యాలపేట, రాజా వీధి, బజార్ వీధి, గాంధీ బొమ్మ, హాస్పిటల్ రోడ్ మీదుగా పురవీధుల్లో బిక్షాటన చేస్తూ ప్రబుత్వం మొండి వైఖరిని ప్రజలకు తెలియజేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరిమళ వెంకటేశ్వరరావు, గూడూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నేదూరు శ్రీనివాసచారి శిభిరం వద్దకు చేరుకుని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు తమ పూర్తి మద్దతు చేసారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారదులుగా సేవ చేస్తున్నా అంగన్‌వాడీలు చీకటి బతుకులలోనే చాలీచాలని జీతాలతో నెట్టుకు వస్తున్నారని, వాళ్ల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేసారు.

సమ్మె బాట పట్టిన ఐదు రోజుల నుంచి దప్పులతో అలమటిస్తూ శిభిరాల్లో కూర్చొని నిరసన చేపట్టడం చాలా బాధాకరమని, ఓ వైపు పని ఒత్తిడి మరో వైపు కుటుంబ పోషణతో నానా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేసారు. తెలంగాణ రాష్ట్రం కన్నా తక్కువ వేతనం ఇస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం ఇవ్వాలని అంగన్‌వాడి హక్కులు సాధించుకొని తీరుతామని డిమాండ్ చేసారు. ఆశా వర్కర్లు జిల్లా ఉపాధ్యక్షురాలు కె. ఉష జిల్లా కమిటీ సభ్యులు కె. భానకి, ఎస్కే రజియా, పి. గున్నమ్మ, ఇ. హేమ, శిబిరం వద్దకు వచ్చి అంగన్‌వాడి కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు తమ తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే వారికి న్యాయపరమైన సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు ఈ. పెంచలమ్మ, కుమారి, ఒగమ్మ, సుబ్బమ్మ, డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్. సురేష్, మున్సిపల్ జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి బి. గోపినాథ్, ఏ. ప్రసాద్, బి. చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య ..!

## పోలీసుల విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు

వెదురుకుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త :

ఏడు అడుగులు నడిచి అగ్ని సాక్షిగా తాళికట్టిన భర్తను ... కడదాకా ఒకరికొకరు తోడునీడగా ఉండాల్సిన భార్యే ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన సంఘటన వెదురుకుప్పం పోలీసుల విచారణలో శనివారం వెలుగులోనికి వచ్చినట్లు తెలిసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి ... మండలంలోని తిప్పినాయుడుపల్లె పంచాయితీ పరిధిలోని తిప్పినాయుడు పల్లె బీసీ కాలనీకి చెందిన చంగల్రాయ బోయిడు, నవనీతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నవాడు ఎన్.గోవిండ్ (29)కి సందు మండలం మానసకు మూడు నెలల క్రితం పెద్దలు కుదిర్చిన వివాహం చేశారు. కాగా గోవిండ్ తిరుపతిలో ట్రావెల్స్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల తిరుపతి యంఆర్‌పల్లె సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వేరు కాపురం పెట్టారు. కాగా శనివారం ఉదయం తన భర్త మరణించిన్నట్లు తిప్పినాయుడుపల్లెలోని కుటుంబ సభ్యులకు తెలపడంతో కుటుంబ సభ్యులు తిరుపతికి వెళ్ళి మృతదేహాంను తిప్పినాయుడుపల్లె బీసీ కాలనీకి తరలించారు. ఐతే మృతదేహం పై ఉన్న గాయాల చూసి అనుమానంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెదురుకుప్పం ఎస్ఐ రమేష్ బాబు గ్రామంకు చేరుకుని మృతదేహాంను పరిశీలించగా గాయాలైన్నట్లు గుర్తించి విచారణ చేపట్టగా భార్య మానస ప్రియుడుతో కలిసి హత్య చేసిన్నట్లు ప్రథమ విచారణలో తెలిసిన్నట్లు ఎస్ఐ వివరించారు. తిరుపతి జిల్లా యంఆర్.పల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య సంఘటన జరగడంతో వారికి కేసు అప్పగించిన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాంను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన్నట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో వివరాలు వెలుగు చూడవలసి ఉంది.



మృతుడు గోవింద్ ఫైల్‌ఫోటో

# విభిన్న ప్రతిభావంతులకు తోడుగా సిఎం జగన్

## జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు



చిత్తూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త: ఎన్నికల పాదయాత్రలో విభిన్నప్రతిభావంతులకు తోడుగా నిలుస్తామని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలుపుకొన్నారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హులైన వారికి సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన వారెవరైన వుంటే సత్వరం దరఖాస్తు చేసుకొని ఆర్థికంగా ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి జిల్లా కేంద్రం చిత్తూరులో ఒక భవనం నిర్మించాల్సివుందని దీనిపై కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ భవన నిర్మాణం కోసం జడ్పీ నుండి 50 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. మేయర్ అముద మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయంను తీసుకొని మనోధైర్యంతో ఆర్థికంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ విభిన్న ప్రతిభావంతుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, గత ఎన్నికల సమయంలో విభిన్న ప్రతిభావంతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వుండేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన విభిన్న ప్రతిభావంతులకు జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, మేయర్ అముదలు ప్రసంశాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ భాషా, జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద రీతిలో ఆశ కార్యకర్త మృతి



కుప్పంరూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త

కుప్పం పట్టణం రామచంద్రారోడ్‌లోని ఓ ఇంట్లో ఆశ కార్యకర్త అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఈసంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మున్సిపల్ పరిధి బేవనపల్లికి చెందిన చైతన్య (38) ఆశ వర్కరుగా గత పదేళ్లుగా చీలేపల్లి పిహెచ్‌సిలో పనిచేస్తోంది. ఈమెకు నలుగురు కుమార్తెలు కాగా ఓ కుమార్తెకు వివాహమైంది. కాగా కుప్పం పట్టణం రామచంద్రారోడ్‌లోని చౌడప్ప బిల్డింగ్‌లో 104ఆంబులెన్స్‌లో డేటా ఎంట్రీ ఆపరేటరుగా పనిచేస్తున్న ఉపేంద్ర (31) నివాసం ఉంటున్నాడు. ఇతని ఇంట్లో చైతన్య అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. సంఘటనా స్థలిని ఇన్‌చార్జ్ ఎస్సై శివకుమార్ పరిశీలించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆశ కార్యకర్త మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## జాతీయ పెన్షనర్ల దినోత్సవంను జయప్రదం చేయాలి

కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త

జాతీయ పెన్షనర్ల దినోత్సవంను కుప్పం ఎన్జీఓ భవనంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పిజి సెల్వం తెలిపారు. ఈకార్యక్రమంకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పెన్షనర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

## బడుగుమాకులపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

శాంతిపురం, డిసెంబర్ 16 ప్రభాతవార్త



మండలంలోని బడుగుమాకులపల్లి, వెదురుగుట్టపల్లి గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ స ంకల్పయాత్రను నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు కేం ద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను ప్రచార రథం ద్వారా వివరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్,మాజీ ప్రధాన కార్యదర్శి రాజసింహ, మండల బిజెపి అధ్యక్షుడు కాశీనాథ్, రఘు, ఎంపిడిఓ హేమమాలిని, సర్పంచ్ ఎవి జయరాం, మురళిమోహన్‌రెడ్డి, కార్యదర్శి అశ్వత్ నారాయణ పాల్గొన్నారు.

## సర్వశిక్ష అభయాన్ ఉద్యోగుల పెన్‌డౌన్

శాంతిపురం, డిసెంబర్ 16 ప్రభాతవార్త

విద్యాశాఖ పరిధిలో సర్వశిక్ష అభయాన్‌లో పనిచేసే ఉద్యోగులు పెన్‌డౌన్ చేపట్టారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఈనెల 20వతేది నుంచి సమ్మె బాట పట్టనున్నట్లు వారు తెలిపారు. తమను రెగ్యులర్ చేయడంతో పాటు తమ డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ బాబ్జీ చిత్రపటంకునివాళులుఅర్పించారు. ఉపాధ్యాయ సంఘ నేతలు ఎస్ఎస్ఎ ఉద్యోగులకు మద్దతు పలికారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కుప్పంరూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త

మదనపల్లి బిటి కాలేజ్ మైదానంలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్‌లో అండర్ -14 విభాగంలో కుప్పం నారాయణ స్కూల్ విద్యార్థి నితీష్‌కుమార్ ఉత ్తమ ప్రతిభ కనబరచినట్లు నిర్వాహకులు తెలిపారు.విద్యార్థిని డిజిఎం కొండలరావు, ఎజిఎం ఫణికుమార్, ఆర్ఐ ప్రసాద్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అభినందించారు.

## కొనసాగుతున్న అంగన్‌వాడీ దీక్షలు

**బంగారుపాళ్యం, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యక్రమాలు చేపట్టిన దీక్షలు శనివారం సైతం కొనసాగాయి. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదుట బంగారుపాళ్యం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బైఠాయించి సమ్మె నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనంలో సగ భాగం పెన్షన్ ఇవ్వడంతో పాటు పదవి విరమణ వయస్సు 62కు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే వైద్యపరమైన ఖర్చులను ప్రభుత్వం భరించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులగా తమను గుర్తించాలన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల నాయకులు లక్ష్మీరాధిక, భారతి, అనిత, రత్న, వరలక్ష్మీ పాల్గొన్నారు.

### బిఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకొన్న హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు

**పాలసముద్రం, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** కృష్ణజిమ్మాపురం పంచాయతీ ఎస్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ సర్వీస్ నేషనల్ అవార్డును అందుకొన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెల 10వ తేదీ జరిగిన కార్యక్రమంలో డాక్టర్ డాక్టర్ ఎస్‌పి సుమనాక్షర్ భారతీయ దళిత సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు సత్యనారాయణ జాటియా, మధ్యప్రదేశ్ మాజీ గవర్నర్ జి.ధనశేఖర్ చేతుల మీదుగా హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు ఈ అవార్డును తీసుకొన్నారు. ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు అందుకొన్నారు. జాతీయ స్థాయిలో అవార్డును అందుకొన్న హెడ్మాస్టర్

## అందరి సహకారంతోనే మండలాభివృద్ధి : ఎంపీపీ



వెదురుకుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త :

ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ నాగరాణి పేర్కొన్నారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతోనే అభివృద్ధి సాధించడంకు వీలవుతుందని గుర్తించాలని చెప్పారు. మండలంలో విధులు నిర్వహించే అధికారులు వారివారి శాఖల్లో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు, ప్రయోజనాల ప్రజలకు చేరవేయడంలో చిత్తశుద్ధితో పనిచేయడం పనిచేయాలని సూచించారు. మండలంలోని ప్రధాన సమస్యల పై అధికారులు దృష్టి పెట్టి వెంటనే పరిష్కారించాలన్నారు. సమావేశంకు హాజరుకాని అధికారుల పై చర్యలు తీసుకోవాలని ఎంపిడివోకు చూచించారు. అనంతరం శాఖలవారిగా సమీక్ష నిర్వహించారు. అధికారులు తమ శాఖలో చేపట్టిన, భవిష్యత్తులో చేపట్టబోతున్న కార్యక్రమాల ప్రగతి వివరాలను సభ్యులకు వివరించారు. జడ్పిటీసీ చలం పాళ్యం సుకుమార్, సింగల్‌విండో చైర్మెన్ లోకనాథ రెడ్డి, తహాశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిటీసీలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు.

వెదురుకుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త :



మండలంలోగల వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి 17 కోట్ల 82 లక్షల 50వేల రూపాయాలు నిధులు మంజూరు కావడం జరిగిందని జడ్పీటీసీ చలం పాళ్యం సుకుమార్, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి సహాయ సహకారంతో వెదురుకుప్పం మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కావడం జరిగిందని చెప్పారు. కళాశాల మంజూరైనప్పటికి భవనాలు లేకు జూనియర్ కళాశాల సిబ్బంది సహాయంతో డిగ్రీ కళాశాలను కూడా అక్కడే నడపడం జరుగుతుందన్నారు. దీంతో ఒంటిపూట తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులకు విద్యాభివృద్ధి కుంటుపడుతుందని డిప్యూటీ సీఎం చొరవ తీసుకుని వేగంగా నిధులు మంజూచేయించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మెన్ బండి గోవర్దన్ రెడ్డి, ఎంపీపీ నాగరాణి, మండల గృహసారధుల కమిటీ అధ్యక్షులు బట్టే సుబ్రమణ్యం, వైస్‌ఎంపీపీలు రమణమ్మ, విజయమునికృష్ణ రెడ్డి, కోప్షన్ సభ్యులు వెంకటేష్, సర్పంచులు, ఎంటిసీలు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేవి క్రీడలు

కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త



విద్యార్థుల్లో క్రీడలు ఒత్తిడిని తగ్గిస్తాయని అలాగే మానసిక, శారీరక ఎదుగుదలకు తోడ్పడతాయని హాకింగ్స్ స్కూల్ చైర్మన్ ఎస్‌డి హఫీజ్ పేర్కొన్నారు. గత వారం రోజులుగా హాకింగ్స్‌లో జరిగిన వార్షిక క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా ఆయ న ప్రస ంగించారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడాస్ఫూర్తితో జిల్లా, రాష్ట్ర, దేశస్థాయిల్లో విద్యార్థులు రాణించి మంచిపేరు సాధించాలని సూచించారు. తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలను సైతం ప్రోత్సహిస్తున్నట్లు డైరెక్టర్లు షబ్బీర్, రఫీక్ తెలిపారు. ఈసందర్భంగా పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఛాంపియన్స్ ట్రోఫీని బ్లూహౌస్ జట్టు గెలుచుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంటోనీ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ అరుణాసింగ్ చౌహాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమ్మెకు జనసేన మద్దతు

కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త



తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగిన అంగన్‌వాడీ కార్యకర్తలకు కుప్పంలో జనసేన పార్టీ మద్దతు పలికింది. నియోజకవర్గ కోఆర్డినేటర్ డా॥ నరేష్ శనివారం దీక్షకు మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ న్యాయమైన అంగన్‌వాడీల డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 26వేల గౌరవవేతనం చెల్లించాలని సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని విస్మరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## కమలాంజనేయస్వామికి ఆకుపూజ

చౌడేపల్లి, డిసెంబర్ 16 ప్రభాతవార్త

స్థానిక బస్టాండు వద్దగల కమలాంజనేయస్వామికి ఆకుపూజను శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయాన్నే ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకం, ఆకుపూజగావించారు. శనివారం విశేష సంఖ్యలో భక్తులు కమలాంజనేయస్వామిని దర్శించుకొన్నారు. అనంతరం పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## కృష్ణదేవరాయ విగ్రహావిష్కరణకు తరలిరండి

చౌడేపల్లి, డిసెంబర్ 16 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే శ్రీకృష్ణదేవరాయ కాంస్య విగ్రహావిష్కరణకు తరలిరావాలని యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎమ్మెఎస్‌చారిటబుల్ భవనంలో మాట్లాడుతూ మదనపల్లి వద్దగల పాత ఆర్డీఓ కార్యాలయ సమీపంలో అత్యంత వైభవంగా విగ్రహావిష్కరణ వుంటుందనీ, అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాటిపేరి మురళి, గాజుల మోహన్, పగడాల రాము తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

## అంగన్‌వాడి ఉద్యోగుల సమ్మెకు బిజెపీ నాయకుల మద్దతు

తవణంపల్లె, డిసెంబర్ 16 ప్రభాతవార్త:

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు బిజెపీ నాయకులు శనివారం తమమద్దతు ప్రకటించారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారంకు ఐదవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఐరాల క్రాస్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కార్యాలయం ఎదుట ఐరాల తవణంపల్లె మండలాలకు చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో ఐరాల మండల మండల బిజెపీ అధ్యక్షుడు ఎం.కుమార్, ప్రధాన కార్యదర్శి బి.పరదేశి, కార్యదర్శి భాస్కర్‌నాయుడులు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సృజన పెరిగేలా విద్యార్థులను ప్రోత్సహించాలి

పుంగనూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త :



ఉన్నత తరగతుల విద్యార్థులలో సృజన పెరిగేలా వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహించి,తీర్చిదిదా ్దలని ఎంఇఓ చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించి ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఎపుడూ కొత్త పంథాలో ఆలోచించ దం,వాటిని కార ్యరూపంలోనికి తీసుకురావడమే సైన్స్‌ధ్యే యమని, వాటిని అనుసరించిన మేధావులు శాస్త్రవేత్తలుగా ప్రపంచానికి వేలాది ఆవిష్కరణలు నిర్వహించి చూపార న్నారు. కార్యక్రమంలో ఎంఇఓ2 రెడ్డెన్నశెట్టి,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా వైజ్ఞానిక ప్రదర్శనలు



తవణంపల్లె, డిసెంబర్ 16 ప్రభాతవార్త:

మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థిని, విద్యార్థులు తాము తయారుచేసిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంకు ఎంఈఓ-2 త్యాగరాజులురెడ్డి, పాఠశాల హెచ్ఎం శ్రీరంజనిలు పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో ఎన్నికైన నమూనాలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు దేవరాజులు రెడ్డి, ఈజె విజయ కృష్ణారెడ్డిలతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త

సాయిమాతా సేవా ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిచే ఆదివారం స్థానిక బాలుర హైస్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు తెలిపారు. కంటి జబ్బులతో బాధపడే వారు ఈశిబిరాన్ని సద్వినియోగం

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సమ్మె నోటీసు అందజేసిన మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు

గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త



గూడూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కమిషనరు ఎం. వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేసారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సమాన పనికి పనికి సమాన వేతనం ఉద్యోగాల పర్మినెంట్, ఇంజనీరింగ్ కార్మికులకు డ్రైవర్లకు 18500 జీతం తదితర డిమాండ్ పరిష్కారం కొరకై 2023 డిసెంబర్ 11,12,13వ తేదీలలో నిరాహార దీక్షలు నిర్వహిస్తామని అనంతరం డిసెంబర్ 21 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని పలు డిమాండ్స్‌తో కూడిన సమ్మె నోటీసు అందజేసారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కార్యదర్శి బి. గోపినాథ్, పట్టణ అధ్యక్షులు బి. రమేష్, కార్యదర్శి డి. కోటేశ్వర రావు, పట్టణ శ్రామిక అధ్యక్షురాలు బి. ప్రభావతి, కార్యదర్శి ఎం. సంపూర్ణమ్మ, గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్ సురేష్, ఏ. ప్రసాద్, జిల్లా కమిటి సభ్యులు బి. పెంచల ప్రసాద్, యు. కిషోర్, సుబ్బమ్మ, లక్ష్మి, పోలమ్మ, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులు రెడ్డి

గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త



గత నాలుగు రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడి పాఠశాలలను నిర్వహించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు పంట శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని అంగన్‌వాడి వర్కర్లు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఆయాలకు 17000 ఇవ్వాలన్నారు. సమావేశంలోనాయకులుపూలచంద్రశేఖర్,వేమయ్య,భాస్కర్‌రెడ్డి,నాగభూషణం,సిద్ధయ్య,మూర్తిపాల్గొన్నారు

### ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషను కలిసిన ఎమ్మెల్యే వరప్రసాద్ రావు

గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త



ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషని విజయవాడలో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు మర్యాదపూ ర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14,75,000 జామియా మసీద్ గూడూరు ప్రభుత్వంకి సాంక్షన్ చేసిన నిధులు ఇంకా రాలేదని దయచేసి ఇప్పించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఇటీవల ముఖ్యమంత్రి మిచౌంగ్ తుఫాన్ బాధితులను పరామర్శించేందుకు వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి వచ్చినప్పుడు ముస్లిం సోదరులు అజిత్ ఖాన్, పలువురు గూడూరు నుండి అక్కడికి వెళ్లి గూడూరు జామియా మసీదు అభివృద్ధి పనులు ఏర్పాటు చేసుకుంటామని సిఎంకి చెప్పడంతో వారు దానిని అంగీకరించారు. అందువల్ల సిఎం చెప్పారని గూడూరు జామియా మసీదుకు నిధులు మంజూరు చేయవల్సిందిగా వారిని ఎమ్మెల్యే కోరారు.

## అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు

కోట, డిసెంబర్ 16 ప్రభాతవార్త



కోట మండల రెవెన్యూ అధికారుల వ్యవహారశైలి సక్రమంగా లేనందున ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని వైసీపీ సీనియర్ నాయకుడు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం కోట మండలం కొక్కుపాడు, తిమ్మానాయుడుపాలెం గ్రామాల ప్రజలు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని తమకు తుపాను బియ్యం పంపిణీ చేయలేదని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పద్మావతి మాట్లాడుతూ వాలంటీర్లు ఇచ్చిన జాబితా మేరకే గ్రామాల్లో బియ్యం ఇచ్చారని పేర్కొన్నారు. దాంతో గ్రామస్థులు తీవ్ర స్థాయిలో అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అధికారులు సమన్వయంతో పనిచేసి అందరికీ బియ్యం పంపిణీ చేయకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్రమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## పంచాయతీకి బాడుగలు చెల్లించాలి : ఎంపిడిఓ

కోట, డిసెంబర్ 16 ప్రభాతవార్త

కోట పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణం సమీపంలో నిర్మించిన 23 దుకాణాల వారు అద్దెలు చెల్లించి పంచాయతీకి సహకరించాలని ఎంపిడిఓ మార్నెళ్ల భవాని కోరారు. శనివారం ఎంపిడిఓ భవాని, ఇఓపిఆర్‌డి నయీమ్, కార్యదర్శి శ్రీనివాసులు దుకాణదారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భవాని మాట్లాడుతూ 2018 నుంచి కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ గదులకు బాడుగలను పంచాయతీకి చెల్లించాల్సి ఉందన్నారు. అయితే దుకాణదారులు సానుకూలంగా స్పందించారు.

## 27 ఏళ్లుగా న్యాయ పోరాటం

కోట, డిసెంబర్ 16 ప్రభాతవార్త

కోట ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో 23 కుటుంబాల చిరు వ్యాపారులు పలు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయభాస్కర్ చెప్పారు. ఆయన శనివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ తాము 27 సంవత్సరాలుగా అటు ఆర్టీసీ, ఇటు ఆర్అండ్‌బి, మరోవైపు పంచాయతీ అధికారులతో న్యాయపోరాటం చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము బాడుగల నగదును బ్యాంకు అకౌంట్‌లో వేస్తున్నామని తెలిపారు. తమకు ఏ ఒక్క అధికారీ ఫలానా అధికారులకు బాడుగలు చెల్లించాలని చెప్పకపోవడంతో తాము న్యాయస్థానం ఆదేశాల మేరకు బ్యాంకులో జమ చేస్తున్నామని తెలిపారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ మంచి మనసుతో మండల స్థాయి అధికారులు తమను ఆదుకొని అందరికీ సమన్యాయం చేయాలని ఉదయభాస్కర్ కోరారు.

## కర్లపూడిలో లబ్ధిదారులకు తుపాను నగదు పంపిణీ

కోట, డిసెంబర్ 16 ప్రభాతవార్త



కోట మండలం కర్లపూడి గ్రామాన్ని ఇటీవల మిచౌంగ్ తుపాను అతలాకుతలం చేసింది. గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. రోడ్లు తెగిపోయాయి. పొలాలు ఇసుకమేటలు వేశాయి. ఈ నేపథ్యంలో వరదలకు దెబ్బతిన్న కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. శనివారం కర్లపూడి గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి, సిద్ధవరం సొసైటీ మాజీ చైర్మన్ సన్నారెడ్డి వెంచురాఘవరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు.

## వరద బాధితులకు నగదు పంపిణీ

దొరవారిసత్రం, డిసెంబర్ 16 ప్రభాతవార్త



మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న కుటుంబాలకు శనివారం నగదు పంపిణీ చేశారు. దొరవారిసత్రం మండలం వీఎంఆర్ నగర్ గ్రామంలో ఉన్న 57 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున ఒక లక్షా 42 వేల 500 రూపాయలు జడ్పీటీసీ టి.రమేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీరితో పాటు విఆర్ఓ వెంకటరత్నం, నాయకులు బాబు తదితరులు ఉన్నారు.

## వరద బాధిత గిరిజనులకు నవజీవన్ చేయూత

దొరవారిసత్రం, డిసెంబర్ 16 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండల పరిధిలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న గిరిజన కుటుంబాలకు నవజీవన్ సంస్థ చేయూత అందించింది. శనివారం దొరవారిసత్రం మండలం ఏకొల్లు హైస్కూలు వద్ద నవజీవన్ సంస్థ 180 కుటుంబాలకు అన్ని వంట సరుకులతో పాటు ఒక్కో బస్తా బియ్యాన్ని అందజేశారు. ఏకొల్లు గ్రామ సర్పంచ్ బ్లెస్సీ ఆధ్వర్యంలో 180 కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపిరెడ్డి, ఎంపిడిఓ రఘురామయ్య, ఇంజనీర్ అసిస్టెంట్ పోలయ్య తదితరులు పాల్గొన్నారు

## నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం

దొరవారిసత్రం, డిసెంబర్ 16 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండల సర్వసభ్య సమావేశం శనివారం నామమాత్రంగా అధికారులు నిర్వహించారు. అజెండాను పాటించకుండా ఇష్టారాజ్యంగా స్థానిక అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి గత సమావేశంలో అజెండా పనితీరు, ప్రస్తుతం మండలంలో ఉన్న సమస్యలను ఈ సమావేశంలో తెలియజేసి వాటిని పరిష్కరించే వేదికగా నిర్వహించాలి. కాని దొరవారిసత్రం మండలంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. పేరుకే సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారే గాని, ఇక్కడ ఎలాంటి పనులు చేస్తున్నారో కూడా తెలియజేయకపోవడం దారుణమని పలువురు అంటున్నారు. శనివారం ఆకస్మికంగా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.

## ఆడుదాం ఆంధ్ర పోటీల్లో యువత పాల్గొనండి

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, డిసెంబర్ 16, ప్రభాతవార్త



యువత కోసం సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. 50 రోజులు పాటు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఆరోగ్యంగా ఉండేందుకు ఉత్సాహం ప్రదర్శించేందుకు ఆటలు పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 50 రోజులు పాటు ఉల్లాసంగా ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర జరుగుతుందన్నారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి వల్లే రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. మరల సిఎం జగన్మోహన్ రెడ్డిని 2024లో జరిగే ఎన్నికల్లో గెలిపించుకోవాలని ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

## తుఫాను సాయం అందలేదని ధర్నా

బాలాయపల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త



బాలాయపల్లి మండలంలోని వెంగమాంబపురం ఎస్సి కాలనీకి చెందిన కొంత మంది మహిళలు, గ్రామస్తులు తుఫాను నష్టపరిహారం తమకు అంద లేదని వెంటనే అందించాలని ఆందోళన చేపట్టారు. కొంత మందికే నగదు, నిత్యవసర సరుకులు ఇచ్చారని, తమకు ఇవ్వలేదంటూ ఆందోళన చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులను, సర్పంచ్ బి. వెంకటసుబ్బయ్యను నష్టపరిహారం ఇవ్వాలని నిలదీసారు. దీంతో సర్పంచ్ వెంకటసుబ్బయ్య వీఆర్‌ఓకు చరవాణి ద్వారా సమాచారాన్ని అందజేసారు. అర్హులైన అందరికీ రెండవ విడతలో నగదు, సరుకులు అందిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించి వెనుతిరిగారు.

## ఓటర్ల జాబితా పై బిఎల్ఓలతో సమావేశం

బాలాయపల్లి, డిసెంబర్ 16, ప్రభాతవార్త



బాలాయపల్లి తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఓలతో ఓటర్లు సవరణలు, మార్పులు, చేర్పులు, మరణించిన వారి వివరాల ఓట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఫారం 7ను కుటుంబ సభ్యులతో సేకరించి తొలగించాలని సూచించారు. ఇష్టానుసారంగా ఓట్లను తొలగిస్తే చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓట్ల తొలగింపుకు 370 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ వివరించారు. ఈ సమావేశంలో బిఎల్ఓలు, ఏవో శిరీష, ఈవోపిఆర్డి శ్రీనివాసులు ఉన్నారు.

## గృహాలు కోల్పోయిన బాధితులకు ఆర్థిక సహాయం అందజేత

వాకాడు, డిసెంబర్ 16, ప్రభాతవార్త



మిచౌంగ్ తుఫాను వలన సంభవించిన భారీ వర్షాలకు, వరదలలో గృహాలు కోల్పోయిన బాలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నలుగురు బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని శనివారం వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి పంపిణీ చేశారు. గృహాలు కోల్పోయిన ఒక్కో కుటుంబానికి లక్ష ఇరవై వేల రూపాయిలు, నాలుగు కుటుంబాలకు ఆయన ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్‌వి నరసింహారావు, ఎంపిడిఓ తోట గోపినాథ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సెల్వరాజ్, పంచాయితీ కార్యదర్శి సుభాషిని, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షాన్ని సైతం లెక్క చేయక . . .

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల తాకిడి అధికమైంది. ఓ వైపు వర్షం, మరో వైపు తుఫాను హెచ్చరికలు ఉన్నా శివయ్య దర్శనానికి భక్తులు తండోప తండాలుగా కదలి వచ్చారు. దాంతో పరిస్థితి ఆదుపు చేయటానికి సిబ్బంది తంటాలు పడ్డారు. ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు 3500 దాటాయి. కాగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 46, చండీ హోమాలు 4 స్వామి అమ్మవార్ల అభిషేకాలు 46, శనీశ్వరాభిషేకాలు 43, నిత్యకళ్యాణాలు రెండు జరిగినట్లు ఆలయాధికారులు ప్రకటించారు. సుమారు 20 వేలమంది దర్శించుకున్నట్లు ప్రకటించారు.

## ఓటరు దరఖాస్తులు సమగ్రంగా పరిశీలించండి

తొట్టంబేడు, డిసెంబర్ 16 ప్రభాతవార్త



ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న వారి ఫారాలు సమగ్రంగా పరిశీలించాలని తొట్టంబేడు ఎన్నికల ప్రత్యేక అధికారి మధుసూధన్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సూపరింటెండెంట్, విఆర్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న వారి దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి వాటికి అవసరమైన పత్రాలు ఉన్నాయా లేవా చూడాలని విఆర్‌ఓలను ఆదేశించారు. అదేవిధంగా మృతిచెందిన వారి ఓటర్లను తొలగించాని లేని పక్షంలో ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మురళీ, ఆర్‌లు, విఆర్‌ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యాన్నధాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సుబాంక్‌నాగస్ తిరుమద్చేరి సికింద్రాబాద్ వాస్తవ్యులు దాసరి గిరిసీతసాయితులసి పేరుపై పుట్టినరోజు సందర్భంగా తండ్రి బాలాజీ మరియు కుటుంబసభ్యులతో కలసి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులకు చెక్కును అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శనం చేయించి శేషవస్త్రాలను తీర్ధప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో మండలి సభ్యులు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, దేవస్థానం అధికారులు ఛైర్మన్ సిసి సుదర్శన్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు పసలకుమారస్వామి, హేమంత్ కుమార్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధనారీశ్వరాలయ పనులు వేగవంతం చేయండి

-రూ.2 కోట్ల నిధులతో పునఃనిర్మాణ పనులు

తొట్టంబేడు, డిసెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా స్వర్ణముఖి నదీతీరాన వెలసిన మండలంలోని అర్ధనారీశ్వరాలయ పునఃనిర్మాణ పనులు వేగవంతం చేయాలని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారక శ్రీనివాసులు సంబందిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. శ్రీకాళహస్తికే తలమానికంగా ఉన్న పురాతన దేవాలయాల్లో అర్ధనారీశ్వరాలయంకు సుమారు రూ.2కోట్లు నిధులతో పునఃనిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ఇంజనీరింగ్‌శాఖ అధికారులతో కలసి పరిశీలించారని ప్రస్తుతం పునఃనిర్మాణ పనుల్లో వేగవంతం చేయాలని ఇంజనీరింగ్‌శాఖ అధికారులు మరియు కాంటాక్టర్ తెలిపారు. రాబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లోపు మహాకుంభాభిషేకం చేపట్టాలని కాలయాపన చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్‌శాఖ డిఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, స్తపతి కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, కాంటాక్టర్ రాఘవరెడ్డి, మరియు దేవస్థానం సిబ్బంది ఛైర్మన్ సిసి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల కోసం ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం..బొజ్జలసుధీర్

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న దీక్షకు మద్దతుగా శనివారం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి విచ్చేసి కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలా ఉన్నా తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీకాళహస్తిలో మాత్రం ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు 2సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు రూ.5లక్షలు హెల్త్ ఇన్సూరెన్స్‌ను సొంత నిధులతో చేయిస్తాని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పడుతున్న బాధలు తమక తెలుసని జగన్‌రెడ్డి అక్కాచెల్లెమ్మలు అంటూ వారిని నట్టేట ముంచాడని రాబోవు రోజుల్లో తెదేపానే వీరికి న్యాయం చేస్తుందన్నారు. దీక్ష చేసిన ఎన్నిరోజులైనా వారికి భోజనాలు తెలుగుదేశంపార్టీ తరపున ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం, దశరధాచారి, మునిరాజానాయుడు, రంగినేని చెంచయ్యానాయుడు, మహేష్ లతోపాటు ఉద్యమాల సంఘాల నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో అంగన్‌వాడీలకు జనసేన మద్దతు

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), డిసెంబర్ 16 ప్రభాతవార్త



నియోజకవర్గంలోని ఏర్పేడు, రేణిగుంట మండలాల అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్షకు సంఘీభావంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు న్యాయ బద్ధంగా కోరుతూ డిమాండ్‌లు పరిష్కరించాలని చేస్తున్న దీక్షలో భాగంగా రేణిగుంట, ఏర్పేడు మండల అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. పాదయాత్రలో నా అక్కచెల్లెమ్మలు అని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2లక్షల మంది నిరసన చేస్తుంటే పట్టించుకోకుండా జగన్‌రెడ్డి ఉండడం బాధాకరం అన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్న డిమాండ్లు, పెన్షన్, గ్రాట్యుటీ తదితర డిమాండ్లు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బాలాజీ, పార్ధసారధి, రాఘవయ్య, రవికుమార్‌రెడ్డి, త్యాగరాజు, జ్యోతికుమార్, భాస్కర్‌బాబు, మాజీ ఎంపిటిసి జయలలిత, నితీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నభోజనం నాణ్యతగా ఉండాలి..ఎంఈవో

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనం నాణ్యతగా ఉండాలని ఎంఈవో బాలయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఉన్న సరస్వతీబాయి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. గతంలో పాఠశాలలకు అందించే మధ్యాహ్నభోజనం అన్ని పాఠశాలలకు ఒక్కరే కాంటాకుతో తయారుచేసి పంపేవారని అయితే పాఠశాలలో హెచ్‌ఎం బృందాదేవి ప్రత్యేకంగా విద్యార్థులకు మధ్యాహ్నభోజనం తయారుచేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెను ప్రకారం భోజనం అందిస్తామని తమ పాఠశాలలోనే స్వయంగా తయారు చేసి విద్యార్థులకు అందిస్తే విద్యార్థులు క్యారియర్లు తెచ్చుకోవడం మానివేస్తారన్నారు. అనంతరం ఎస్ఏ-1 పరీక్షల ఫలితాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించి ఎవరెవరు ఎలా చదువుతున్నారో వివరించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

## రాజీవ్‌నగర్‌లో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



పట్టణంలోని 25వ వార్డు రాజీవ్ నగర్ కాలనీలో రోడ్లు అధ్వాన్నంగా మారాయని, పట్టించుకునే దిక్కులేదని పలువురు కాలనీ వాసులు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డిలకు విన్నవించారు. ఇంటింటికి మీబొజ్జల కార్యక్రమంలో భాగంగా యూనిట్ ఇన్‌ఛార్జులు కిట్టు, ఇన్‌ఛార్జి యశ్వంత్, నాయకులు గుర్రప్పశెట్టి ఆధ్వర్యంలో శనివారం ఆమె పట్టణానికి సమీపంలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో పర్యటించి కాలనీలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్ళి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వాలు మారినా రాజీవ్‌నగర్ కాలనీలో మాత్రం సదుపాయాలు కరువయ్యాయని వర్షానికి ప్రధాన రోడ్డు బురదమయం కావడంతో ఇబ్బందిగా మారిందని పలువురు తెలిపారు. అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కొన్ని చోట్లు రాజీవ్‌నగర్‌లో సిసి రోడ్లు వేసి, డ్రైనేజీ కాలువలు కట్టకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఎంతో మహోన్నత ఆశయంతో నిరుపేదలకు టిడ్కో ఇంటి నిర్మాణాలకోసం మున్సిపాలిటీకి నిధులు చెల్లించామని ఇప్పటి వరకు ఇండ్లు పూర్తికాలేదన్నారు. డబుల్ బెడ్‌రూంల నిర్మాణం కోసం రూ.లక్ష చెల్లించిన వారికి కనీసం సమాధానం చెప్పలేని పరిస్థితి అధికార పార్టీ నాయకులు, అధికారులకు లేదా అని ప్రశ్నించారు. అనంతరం చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని రిషితారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయకుమార్‌నాయుడుతో పాటు రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి, చెంచయ్యనాయుడు, సుబ్బయ్య దశరధాచారి, సుమతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల రక్షణ కోసం అనుబంధ పాఠశాలను ప్రారంభించాం - పవిత్రరెడ్డి

రేణిగుంట, డిసెంబరు 16 ప్రభాతవార్త:



పిల్లల రక్షణ కోసం గురవరాజుపల్లె ఎస్టీ కాలనీలో అనుబంధ పాఠశాలలను ప్రారంభించినట్లు వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డి తెలిపారు. జాతీయ రహదారి వెడల్పు చేయడంలో భాగంగా రోడ్డు దాటుకుని పిల్లలు పాఠశాల చేరుకోవడం ప్రమాదకరంగా మారడంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు, డీఈవో ఆదేశాలతో గురవరాజుపల్లె ఎస్టీ కాలనీలో శనివారం అనుబంధ పాఠశాలను ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పవిత్రరెడ్డి మాట్లాడుతూ చదువుకోవాల్సిన పిల్లలు బడులకు వెళుతున్నప్పుడు వస్తున్నప్పుడు జాతీయ రహదారి దాటడం ప్రమాదకరమన్నారు. పిల్లల రక్షణ కోసం అనుబంధ పాఠశాలను ప్రారంభించామన్నారు. పిల్లలు బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, గురవరాజుపల్లె వైసీపీ నేత రహిం, ఎంఈవోలు ఇందిరా దేవి, రంగనాథయ్య, పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆకతాయిలపై కేసు ఎందుకు కట్టలేదు

పోలీసులను ప్రశ్నించిన ఎమ్మెల్యే

పిచ్చాటూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త:



పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను ధ్వంసం చేసిన ఆకతాయిలపై ఎందుకు ఇంకా కేసు నమోదు చేయలేదని స్థానిక పోలీసులను ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశ్నించారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు జూనియర్‌కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించాం. ఈ సందర్భంగా ఈ నెల 8న ఆకతాయిలు ధ్వంసం చేసిన మరుగుదొడ్లను కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ధ్వంసమైన మరుగుదొడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారా అని అధ్యాపకులను అడిగారు. సంఘటన జరిగిన ఈ నెల 8నే ఫిర్యాదు చేశామని చెప్పడంతో పక్కనే హెడ్ కానిస్టేబుల్ వెంకటమునిని కేసు నమోదు చేశారా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇంకా కేసు నమోదు చేయలేదని చెప్పడంతో ఎస్ఐ వెంకటేశ్వరులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి మరుగుదొడ్లను కూల్చిన ఆకతాయిలపై కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ పథకం ద్వారా కళాశాల ఆవరణను శుభ్రం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులకు సూచించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీధర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

## అభాకస్ వల్ల పిల్లల మెదడు చురుకుగా పని చేస్తోంది

ప్రొఫెసర్ సుగుణమ్మ

తిరుపతి మహిళావర్సిటీ, డిసెంబర్ 16, ప్రభాతవార్త



అభాకస్ వల్ల పిల్లల మెదడు చురుకుగా పని చేస్తోందని ప్రొఫసర్ సుగుణమ్మ అన్నారు. స్థానిక బైరాగిపట్టెడలో ఉన్న సిపిఐ గందమనేని శివయ్య భవన్‌లో శనివారం ఎక్స్ ఎల్ అబాకస్ వారు నిర్వహించిన కార్యక్రమానికి మహిళా యూనివర్శిటీ ప్రొ. సుగుణమ్మ విచ్చేసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ అబాకస్ చేయడంవ వల్ల పిల్లలు మెదడు చురుకుగా పనిచేస్తుందని మాథ్స్ చేయడంలో స్పీడ్ డెవలప్మెంట్ అవుతుందని తెలిపారు. అబాకస్ వల్ల బ్రెయిన్ రైట్ బ్రెయిన్ సమానంగా పనిచేయడం వల్ల విద్యార్థుల మీద శక్తి పెరుగుతుందన్నారు. పోటీ పరీక్షల్లో ప్రవీణ్ సాధించేందుకు అంకగణితం ఎంతో కీలకమన్నారు. గణితం పై పట్టు సాధించలేకపోవడం వల్లే ఎన్నో సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. విజ్ఞానం నైపుణ్యం సాధించాలంటే అందుకు తగిన శిక్షణ విద్యార్థులకు అవసరమన్నారు. అబాకస్‌తో గణితం అంటే భయం పోతుందని ఇష్టంగా లెక్కలు చేయగలుగుతారన్నారు. అనంతరం అబాకస్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులందరికీ బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి లక్ష్మణ్, జోనల్ సీవో బిందు మాధవి, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీల్లో నగదు రహితంగా ఇంటి పన్ను వసూలు చేయాలి

సత్యవేడు, డిశంబరు 16, ప్రభాతవార్త :

ప్రతి పంచాయితీ పరిధిలోనూ ఇకపై నగదు రహితంగా ఇంటి పన్నులు వసూలు చేయాలని సూళ్ళూరుపేట డివిజినల్ పంచాయితీ అధికారి రవీంద్రబాబు కార్యదర్శులకు ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగదు రహితంగా పన్నులు వసూలు చేయడానికి ఇప్పటికే స్కానర్స్, మిషన్స్ పంపిణీ చేశామన్నారు. ఈనెల ఆఖరికి 30శాతం, జనవరి 30వ తేదిలోపు 60శాతం, ఫిబ్రవరి చివరి నాటికి 100శాతం ఇంటి పన్నులు వసూలు చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప పథకంలో భాగంగా పంచాయితీ పరిధిలో పారిశుద్యం మెరుగుపరచాలన్నారు. చెత్తను సేకరించి బృందావనాలకు తరలిస్తున్న గ్రీన్ అంబాసిడర్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధులునుండి వేతనాలు సర్దుబాటు చేయాలని, గ్రామాల్లో దోమలనివారణకు చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో చంద్రశేఖర్, కార్యదర్శులు మునిరికుమార్, ప్రకాష్, మాధవి, రజిత, జలజశ్రీలు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని గాయపడిన ద్విచక్రవాహన దారుడు మృతి

- గ్రావెల్ తరలింపులపై తెదేపా నాయకుల నిరసన

సత్యవేడు, డిశంబరు 16, ప్రభాతవార్త :

మండలంలోని వెంకటరాజుల కండ్రిగ వద్ద ఎర్రమట్టి గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్ లారీ, ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఈఘటనలో ద్విచక్రవాహన దారుడు మదనంబేడుకు చెందిన పార్థసారధి కుమారుడు గోపి(40)గా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన గోపిని సత్యవేడు ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్సను అందించారు. మెరుగైన వైద్య చికిత్సలకోసం చెన్నై జనరల్ హాస్పిటల్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం గోపి(40) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

***గ్రావెల్ తరలింపులపై రోడ్డెక్కి నిరసన తెలిపిన తెదేపా నాయకులు***

శుక్రువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంకు ప్రధాన కారణంగా ఎర్రమట్టి గ్రావెల్ తరలింపులేనని స్థానిక తెదేపా నాయకుడు భాషా, కార్యకర్తలతో కలిసి సంఘటనస్థలంలో రోడ్డెక్కి నిరసన తెలిపారు. పరిమితికి మించి గ్రావెల్ తరలింపులకు ఎన్‌ఓసిలు ఇస్తూ అధికారులు ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. గోపి మరణానికి ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులే భాధ్యత వహించాలన్నారు. సిఐ శివకుమార్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని తెదేపా నాయకుల తమ నిరసనను విరమింపచేశారు

## నేడు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

మెడికల్ కాంట్రాక్ట వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్టా మహేంద్ర పిలుపు

తిరుపతి టౌన్, డిసెంబర్ 16, ప్రభాతవార్త



ఈనెల 17,18,19 తేదీల్లో మూడు రోజులపాటు కాళహస్తి పట్టణంలో జరుగుతున్న మహా సభలు సందర్భంగా ఆదివారం పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని ఈ బహిరంగ సభకు పెద్ద ఎత్తున జిల్లాలోని మెడికల్ కాంటాక్ట్ కార్మికులు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గల పారిశుద్య కార్మికులు సెక్యూరిటీ గార్డులు మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకత్వంతో కలిసి ఆయన కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18, 19 తేదీల్లో జరిగే ప్రతినిధులు సభలో జిల్లాలో మెడికల్ కాంటాక్ట్ కార్మికులు ఎదురొంటున్న అనేక సమస్యలపైన చర్చించి పలు తీర్మానాలు చేయబోతున్నామని మహాసభల అనంతరం పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాలని అందుకు మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కిషోర్, కవిత, రమణయ్య, కాంతరాజు, ద్రాక్షాయిని, చంద్రశేఖర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో రైనీడే సంబరాలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని అక్స్ ఫర్డ్ పబ్లిక్ పాఠశాలలో చిన్నారులకు 'రైనీడే కోలాహలం' చోటు చేసుకుంది. రెండు రోజులుగా ముసార పట్టుకొని చల్లదనం చోటు చేసుకుంది. శనివారం వర్షానికి సంబంధించి చిన్నారుల్లో అవగాహన కల్పించుటకు పాఠశాల మేనేజ్‌మెంట్ చొరవ చూపింది. రైనీడేను నిర్వహించుటకు చిన్నారులకు గొడుగులు తీసుకొచ్చేకోవాలని సూచించారు. వర్షాకాలం ఏ విధమైన దుస్తులు ధరించాలనే అంశాన్ని చిన్నారులకు అవగాహన కల్పించారు. అలాగే ఎలాంటి ఆహారం తీసుకోవాలనే అంశాన్ని కూడా చిన్నారులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రశాంతి ప్రీప్రైమరి ఇన్‌చార్జిశ్రీలత, టీచర్ సారికలు పాల్గొన్నారు.

## సిపాయి భరోసా-పరామర్శ

శ్రీకాళహస్తిరూరల్.డిసెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని వెంకటాపురానికి చెందిన కె.వెంకటమునిచంద్రారెడ్డి మృతి చెందారు. వారి కుటుంబాన్ని శనివారం ఎంఎల్‌సి డడాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తన అనుచరులతో కలసి పరామర్శించారు. ఆయన మృతి తీరని లోటు అని వివరించారు. మునిచంద్రారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి సిపాయి భరోసా కార్యక్రమాల్లో 40 రకాల నిత్యావసర సరకులు అందించారు. ఆయనతో పాటు డాక్టర్ బాబు, మరోహర్‌రెడ్డి. చంద్రశేఖర్‌రెడ్డి, రవి, బత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి (క్రీడా), డిసెంబర్ 16, ప్రభాతవార్త

2024 - 2025 విద్యా సంవత్సరానికి ఎంపిక పరీక్ష ద్వారా 6వ తరగతి, 9వ తరగతులకు బాలబాలికలకు అడ్మిషన్ల కొరకు జాతీయ స్థాయిలో జరగనున్న సైనిక్ స్కూల్స్ ప్రవేశానికి దరఖాస్తులు సమర్పించుటకు 20 డిసెంబర్ 2023 వరకు పొడిగించారని జాతీయ స్థాయిలో 28 జనవరి 2024న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు వయసును బట్టి 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు చక్కటి అవకాశం కలదు. మరిన్ని వివరాల కొరకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లకు సంప్రదించగలరన్నారు.

## దొంగ ఓట్ల సంస్కృతితో భావితరాలు కలుషితం

టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, డిశంబర్ 16 ప్రభాతవార్త:



చారిత్రాత్మక చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్ల సంస్కృతితో భావితరాలను కలుషితం చేయవద్దని టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని సతీమణి, టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి దుయ్యబట్టారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆమె పార్టీ నాయకులతో కలసి తహశీల్దార్ శిరీషాను కలసి కేవలం వారం రోజుల్లో వేల సంఖ్యలో ఓట్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయనీ వాటిని పరిశీలించి దొంగ ఓట్లను తిరస్కరించాలి కోరారు. డిశంబర్ 5 నుండి 9 వరకు 10 వేలు దరఖాస్తులను ఓ పద్దతి ప్రకారం అధికార పార్టీ ప్రాబల్యం వున్న బూత్‌లలో చేర్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. తాము నెలల తరబడి దొంగ ఓట్లకు వ్యతిరేకంగా పోరాడుతున్నామనీ, అయితే అంతే రీతిలో ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దొంగ ఓట్లను చేర్పించే కుట్రకు పాల్పడుతున్నారన్నారు. కలెక్టర్ నుండి తహశీల్దార్ వరకు ఏ మాత్రం మారడంలేదనీ, అంతా ఎన్నికల కమీషన్ పరిధిలో పనిచేస్తున్నామనే విషయం మరచినట్లున్నారన్నారు. వెంటనే దొంగ ఓట్లపై సమగ్ర విచారణ జరిపి తిరస్కరించాలని కోరారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి, డిశంబర్ 16 ప్రభాతవార్త:



సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొరవపల్లి, మొరవపల్లి హరిజనవాడ, కాఇపెంట్ల, కాశిపెంట్ల మాదిగవాడలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన హర్షిత్ రెడ్డి గడపగడపకు వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల కరపత్రాన్ని అందించి గడచిన నాలుగున్నరేళ్ళలో ఆయా కుటుంబాలకు పెన్షన్, అమ్మ ఒడి, విద్యాదీవెన, రైతుభరోసా వంటి పథకాల ద్వారా అందించిన మొత్తాన్ని వివరించారు. ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందించిన స్పూర్తితో ప్రజా సేవకై వస్తున్న మా అన్నయ్య, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎంఎల్ఏగా గెలిపించాలని కోరారు.

## సంక్షేమ ఫలాలు అర్హులకు అందించండి..!

ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం, డిశంబర్ 16 ప్రభాతవార్త:



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులకు అందించాలని అధికారులను ఎంపిపి ఎ.వి.బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేధికలను చదివి వినిపించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి దిశలో నడిపించడానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే చంద్రగిరి నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకై ఆయన కృషి చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ విండో అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసులు, వైస్ ఎంపిపిలు లావణ్య చంద్రబాబు, కవిత భాస్కర్ యాదవ్, ఎంపిటిసిలు మంజుల సిద్దారెడ్డి, కొట్టే చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణవేణమ్మ, రాజేష్, మునీంద్ర యాదవ్, సర్పంచ్‌లు హిమాల్ రెడ్డి, కాకర్ల కావ్య, వేణుగోపాల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలతో యువత ముందుకు సాగాలి

ఎస్వీయు డీన్ ప్రొఫెసర్ విజయ్ భాస్కర్

రామచంద్రాపురం, డిశంబర్ 16 ప్రభాతవార్త:

యువతరం నూతన ఆలోచనా విధానాలతో ముందుకు సాగాలని ఎస్వీయు రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ విజయ్ భాస్కర్ అన్నారు. శనివారం వెంకట్రామాపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో ఎం.ఫార్మశీ విద్యార్థులు పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబుతో కలసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి సూచించారు. కరస్పాండెంట్ యం.సుమలతతో కలసి వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు.

## ఎంఎల్‌సి సాబ్జికి అంగన్‌వాడీల నివాళి

చంద్రగిరి, డిశంబర్ 16 ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో అశువులుబాసిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జికి అంగన్‌వాడీలు నివాళులర్పించారు. స్థానిక కొత్తపేటలో శనివారం అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధనకై నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తమ కమ్యూనిస్టు నాయకుడ కామ్రేడ్ షేక్ సాబ్జి ఆత్మకు శాంతి లభించాలని నినదించారు. ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వాణిశ్రీ దివంగత ఎంఎల్‌సి ఉపాధ్యాయుడుగా, ఎంఎల్‌సిగా ఆలయ అందించిన సేవలను కొనియాడారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు వెనక్కి తగ్గబోమని తేల్చిచెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టిస్తున్న ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణమ్మ, లీలా, వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

గాలి భానుప్రకాశ్

విజయపురం, డిసెంబరు 16 ప్రభాతవార్త :

వైసిపి ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన విజయపురం ఎంపిడిఓ ఆఫీసు ఎదుట జరుగుతున్న అంగర్వాడీ వర్కర్ల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలపుడు ఓట్ల కోసం జగన్మోహనరెడ్డి తెలంగాణా రాష్ట్రంలో కంటే మెరుగైన వేతనం ఇస్తామని నమ్మబలికి ప్రస్తుతం మోసం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు చెప్పుకునేందుకు ముఖ్యమంత్రిని కలవాలన్నా కుదరడం లేదని, సమస్యలు చెప్పే వారి ముఖాలు చూడడం కూడా ఆయనకు ఇష్టం లేదని తెలిపారు. అంగన్‌వాడి కార్యకర్తలకు రూ. 10,500 వేలు, ఆయాలకు రూ. 6000 వేలు పెంచిన ఘనత చంద్రబాబునాయుడుదేనని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ది చెబుతారని విమర్శించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు దశరధరాజు, నాయకులు రాజేంద్రరాజు, రవిచంద్రారెడ్డి, కపిల్, శరత్, దాము, మురళి, శివలింగం, బెంజమిన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

విజయపురం, డిసెంబరు 16 ప్రభాతవార్త :



మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల్లో సైన్స్‌లో ఆసక్తి పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు హెచ్‌ఎం సోమశేఖర్ తెలిపారు. విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్‌లతో మంగళవారం మండల స్థాయిలో ప్రదర్శిస్తామన్నారు. ఉత్తమ ప్రదర్శన పెట్టిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి, రాధాకుమారి, వెంకమరాజు, వెంకటేసులు, జ్ఞానప్రసాద్, విజయవర్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు మాటిచ్చి మరచిన జగన్‌కు తగిన మూల్యం తప్పదు

పిచ్చాటూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త:

తాను అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే అంగన్‌వాడీ వర్కర్లకు వెయ్యి ఎక్కువ జీతం ఇస్తానని మాటిచ్చి మరచిన జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తిరుపతి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు హెచ్చరించారు. ప్రాజెక్టు కార్యాలయం వద్ద 5వ రోజు శనివారం కూడా అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. సమ్మె నిర్వహణ ఖర్చుల కోసం సతీష్‌నాయుడు 5 వేల రూపాయలు నగదును అంగన్‌వాడీలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను బాధించిన నాటి ఉద్యోధనుడు, రావణాసురుడు అంతమైన సంగతి తెలియదా నీకు అలాంటి గతి తప్పదని సీఎం ఉద్దేశించి హెచ్చరించారు. మాజీ మంత్రి చింతామోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఇమ్మని డిమాండ్ చేస్తున్న 26 వేలు ప్రస్తుతం ఉన్న ధరలతో ఏ మూలకు వస్తుందని ఇలాంటిస్వల్ప కోరికలు కాకుండా కనీసం 50 వేలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, జనసేననాయకులు పాల్గొన్నారు.

# వ్యక్తిపై ఒంటరి ఏనుగు దాడి

## - ఏనుగు దారి మళ్లింపుకు అటవీ అధికారుల యత్నాలు !!

కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త

పాలు పోసేందుకు వెళ్లిన ఓ వ్యక్తిపై ఒంటరి ఏనుగు దాడి చేయడంతో అతను గాయాలపాలైన సంఘటన శనివారం రాత్రి నూలుకుంట సమీపంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన ఆవులప్ప (56) అనే వ్యక్తి పాలు పోసేందుకు అని గరిగచీనేపల్లి మార్గంలో బయలుదేరాడు. అయితే మార్గమధ్యంలో హఠాత్తుగా ఓ ఒంటరి ఏనుగు వచ్చి ఆవులప్పపై దాడికి దిగింది. దీంతో ఆవులప్పకు గాయాలైనట్లు తెలిపారు. గాయాలతోనే ఆవులప్ప ఏనుగుబారినుంచి తప్పించుకున్నాడన్నారు. అనంతరం ఆవులప్ప కుటుంబీకులు,గ్రామస్తులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆవులప్పను కుప్పం పిఇఎస్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఒంటరి ఏనుగును దారి మళ్లించేందుకు డిఆర్వో కృష్ణప్రసాద్ నేతృత్వంలో అటవీ సిబ్బంది, ట్రాకర్లు ప్రయత్నాలు చేపట్టారు. ఆవులప్పపై దాడి చేసిన ఏనుగును ఆవులనత్తం గేటు మార్గం ద్వారా దారి మళ్లించే యత్నం చేయగా రాగిమానుమిట్ట మీదుగా వానగుట్టపల్లి గ్రామం దాటుకుని చెక్కునత్తం వైపు వెళ్లింది. అటవీ అధికారులతో పాటు యువత కూడా ఏనుగును దారి మళ్లించేందుకు యత్నిస్తున్నారు. కాగా నడిమూరు అటవీ ప్రాంతం మీదుగా తమిళనాడు అటవీ ప్రాంతంలోకి ఏనుగును తరిమేందుకు చర్యలు తీసుకున్నట్లు డిఆర్వో తెలిపారు.

# ఘనంగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు

తిరుపతి క్రైం, డిసెంబర్ 16, ప్రభాతవార్త

జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఎస్పి పరిపాలన వెంకట్రావు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు, భారతదేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ నివాళులర్పించి వారి సేవలను స్మరించుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి, మహా పురుషుడు. ఆంధ్రులకు ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు కారణభూతుడైన వాడని కొనియాడారు. గాంధీ బోధించిన సత్యం అహింస హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడన్నారు. దేశ మొట్టమొదటి ఉప ప్రధానమంత్రిగా, హోం శాఖ మంత్రిగా పనిచేసి దేశ ప్రజలలో భారత జాతీయ భావనను కలగజేసి నేటి నవ భారతదేశ రూపశిల్పిగా అభివర్ణిస్తూ, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి సాయుధ ధళం లక్ష్మినారాయణ రెడ్డి, ఏవో కిషోర్ కుమార్, డిఎస్పిలు రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్, చిరంజీవి, ఎస్బి సిఐ శ్రీనివాసులు, ఆర్ఐలు శ్రీనివాసులు, నాగభూషణం, చలపతి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శివయ్య సన్నిధిలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి

.శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



దేవాదాయ ధర్మదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కరికాల వల్లవన్ కుటుంబ సభ్యులతో శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులుతోపాటు ఆలయ ఇఓ కెయస్.రామారావులు ఆలయ దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేక దర్శనంతో పాటు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయనకు ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామివారి శేషవస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలు అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో డిప్యుటీ ఈఓ ఎన్ఆర్.కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో ఇఓ ఆకస్మిక తనిఖీలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇఓ కెయస్.రామారావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని దేవస్థానం పడితరం స్టోర్స్, లడ్డుతయారీ విభాగం, అన్నదాన విభాగం స్టోర్స్, మరియు త్రినేత్ర అతిధిగృహం డార్మెటరీలను పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రసాదాల తయారీలో భక్తులకు ఎక్కడా కొరత లేకుండా ఉండాలన్నారు. ముఖ్యంగా భక్తులకు పులిహోర, లడ్డు, వడపై ఎక్కువగా చూపుతున్నారని ఇవి కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు త్రినేత్ర అతిధిగృహంలో ఉంటారని ఇక్కడ గదుల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఇక్కడ నిర్వాహకులకు సూచించారు. వచ్చే భక్తులకు ఇబ్బందులకు గురిచేయవద్దని భక్తిభావంతో శివయ్యను దర్శించుకునేందుకు వచ్చే భక్తులను గౌరవించాలన్నారు. స్టోర్ రూంను పరిశీలించి స్టాకు వివరాలను తెలుసుకుని రిజిస్ట్రర్లను పరిశీలించారు. కొనుగోలు చేసే సరుకుల్లో అవకతవకలు జరిగినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రసాదాల తయారీ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి పలుసూచనలు ఇచ్చారు.

# వైభవంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష కుంకుమ తులసి పూజ

గూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రాజా వీధిలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రతి ఏడాది ముక్కోటి ఏకాదశికి ముందు వచ్చే శనివారం ఉభయకర్తల సహకారంతో లక్ష కుంకుమ, తులసి పూజా కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగానే ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా బల్లవోలు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు దువ్వూరు కిరణ్ కుమార్ రెడ్డి దంపతులు వ్యవహరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తులసి కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. గోవింద మాల భక్తి సేవ సమాజం, దాతలు సహాయంతో 3500 మందికి భారీ అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. సాయంత్రం పల్లకి సేవ, ఊంజల్ సేవతో పాటు స్వామి అమ్మవారులకు కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ బాబు, ఈవో కె నవీన్ కుమార్, దేవాదాయ శాఖ సిబ్బంది దగ్గరుండి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసారు.

# విప్రోత్తములకు రంగస్థలి సత్కారం

తిరుపతి,డిసెంబర్ 16ప్రభాతవార్త:



కార్తీకమాసం చివరిశనివారం కళాకారుడు స్వర్గీయ కొత్తపల్లి ఆనందరావు జయంతి సందర్భంగా ఆరుమంది బ్రాహ్మణోత్తములను రాయలసీమరంగస్థలి సత్కరించింది. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో నాటకరంగంలో ,ఉపాధ్యాయ రంగంలో సుస్థిరస్థానం సంపాదించుకున్న జయలక్ష్మి, పి.అపర్ణ, పాటిబండ్ల మురళి, సురేష్‌స్వామి, బి.శ్రీనివాసులు,కామెడీ శాస్త్రిలను చిత్తూరు జిల్లా కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం, గుండాల గోపీనాథరెడ్డి, కెవెన్ రాజా, కస్పాపద్మనాభం, శంకరయ్య, శ్యాంబోలుహరినాథ్, కేశవులురెడ్డి, చంద్రబాబునాయుడు, సాయినవీనా,వెంకటస్వామి తదితరులు దుశ్శాలువ కప్పి జ్ఞాపికలను బహూకరించారు.



అయ్యప్ప భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయం

ఆలయ పార్కింగ్‌లో భారీగా నిలిచివున్న బస్సులు,వాహనాలు

# ఆటో డ్రైవర్ అనుమానస్పద మృతి

## -మృతుడి ఒంటిపై గాయాలతో, పోలీసులకు ఫిర్యాదు

తిరుపతిరూరల్, డిసెంబర్16 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ చిగురువాడ వైయస్సార్ కాలనీలో ఆటో డ్రైవర్ ఆకస్మిక మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లి జరిగి మూడు నెలలు మాత్రమే, భార్యతో కలిసి నిద్రించిన నవ వరుడు తెల్లవారే కల్లా శవమైన రోడ్డు పక్కన పడి ఉన్నాడు. సహజ మరణంగా భావించి కుటుంబ సభ్యులు స్వంత గ్రామంలో అంత్యక్రియలకు సిద్ధం చేసారు. చివరి క్షణంలో మృతుడి ఒంటిపై గాయాలను గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడం, బాడీని పోస్టుమార్టానికి పంపించారు. వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లికు చెందిన గోవిందుడు(30) తిరుపతిలో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలలు క్రితం మదనపల్లికి చెందిన యువతిలో వివాహం జరిగింది. ఇరువురు కొత్తకాపురాన్ని తిరుపతిరూరల్ చిగురువాడ గ్రామ పంచాయతీ పరిధిలోని వైయస్సార్ కాలనీ పెట్టారు. శుక్రవారం రాత్రి వైయస్సార్ కాలనీ వద్ద అనుమానస్పద స్థితిలో గోవిందుడు మృతి చెందాడు. అర్ధరాత్రి గుర్తించిన భార్య అదే కాలనీలో నివాసం ఉంటున్న సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం చేరవేసింది. మృతుడు తమ్ముడు సహజ మరణంగా భావించి, స్వంత ఊర్లో అంత్యక్రియలకు సిద్ధం చేసాడు. చివరి నిమిషంలో మృతుడి మెడ, గొంతు వద్ద గోరు గాట్లు, గాయాలు గుర్తించి, వెంటనే వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఎస్ ఐ రాజేంద్ర మృతుడి ఒంటిపై గాయాలను పరిశీలించి, హత్యకు సంబంధించిన అనవాలు ఉండటంతో సంఘటన జరిగిన తిరుపతిరూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం గోవిందు మృత దేహాన్ని రుయాకు తరలించారు.

# రైల్వే బ్రిడ్జి కింద నీటిలో ఈత కొడుతూ యువకుడు మృతి



గూడూరు రూరల్, డిసెంబర్ 16, ప్రభాతవార్త

మండలంలోని దీవిపాలెం గ్రామ పంచాయితీ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఉన్న నీటిలో మునిగేందుకు శనివారం స్నేహితులతో కలిసి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందిన గుత్తి సుధీర్ (24) స్థానికుల వివరాల మేరకు కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామానికి చెందిన గుత్తి సుధీర్ ప్రేమ వివాహం చేసుకుని బతుకుదెరువు కోసం చిల్లకూరు గ్రామంలో అద్దె ఇంటిలో ఉంటూ గూడూరులో పెయింట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నీటిలో మునిగిన సుధీర్‌ని స్నేహితులు చిల్లకూరు ప్రాథమిక వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ విషయాన్ని గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్‌కి సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్డం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యాలకు తరలించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కన్నీటి పర్యంతరం అయ్యారు.

# కళ్ళకు గంతలు కట్టుకుని అంగన్‌వాడి సిబ్బంది నిరసన

## ఐదవ రోజుకు చేరిన సమ్మె



వెంకటగిరి, డిసెంబర్ 16, ప్రభాతవార్త

కళ్ళకుగంతులు కట్టుకొని వినూత్న రీతిలో అంగన్‌వాడీ వర్కర్లు ఆయాలు నిరసన తెలిపారు. అంగన్‌వాడి సిబ్బంది చేస్తున్న సమ్మె శనివారం నాటికి ఐదవ రోజుకు చేరింది. అంగన్‌వాడి సిబ్బంది డిమాండ్ పరిష్కరించే వరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చంగయ్య తెలిపారు. వెంకటగిరి సిడిపిఓ కార్యాలయం వద్ద ఐదవ రోజు కళ్లకు గంతలు కట్టుకొని అంగన్‌వాడి ఆయాలు వర్కర్లు నిరసన తెలిపారు. అంగన్‌వాడి సిబ్బంది డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడి సిబ్బంది ఐదు రోజుల నుండి సమ్మె చేస్తుంటే వారి సమ్మెను అణిచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులను పెట్టుకొని ఇన్ని రోజులు అంగన్వాడి కేంద్రాలను నిర్వహించగలరని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సిబ్బంది తలుచుకుంటే ప్రభుత్వాన్ని కూడా మార్చగల సత్తా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో విప్ కొరుముట్ల శ్రీనివాసులు



తిరుమల,డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:

ప్రజలకు మంచి జరగాలని స్వామివారిని వేడుకున్నట్లు రైల్వేకోడూరు ఎమ్మెల్యే,విప్ కొరుముట్ల శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకున్నారు.

# టిటిడి సిబ్బంది నిజాయితీ

తిరుమల,డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలలో గదిని పొందిన భక్తులు దేవుని దర్శనానతంరం ఖాళీచేసిన సమయంలో ఓ విలువైన సంచిని వదలిపెట్టి వెళ్ళారు. దీన్ని శనివారం ఉదయం గదిని శుభ్రం చేయడానికి వెళ్ళిన సిబ్బంది గమనించారు. పీలేరుకు చెందిన భక్తులు ఏఎన్‌సి గది 409ని అద్దెకు తీసుకున్నారు. శనివారం ఖాళీచేసి హడావిడిలో ఓ సంచిని మరచిపోయారు. తిరిగి సిబ్బంది సహాయంతో ఆ సంచిని భక్తులకు అందజేసినట్లు ఏఎన్‌సి,మాధవనిలయం మేనేజర్ ఎల్ఎన్‌వి రవికుమార్ తెలిపారు.

# అయ్యప్ప స్వామికి అంబళ పూజ

బంగారుపాళ్యం, డిసెంబర్ 16 ప్రభాతవార్త:

మండల కేంద్రం బంగారుపాళ్యం నందు శనివారం అయ్యప్ప స్వామికి అయ్యప్ప భక్తులు అంబళ్ళ పూజ నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన అంబళంపై అయ్యప్పస్వామి, వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామి చిత్రపటాలను వుంచి విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు మధ్యాహ్నం అయ్యప్ప స్వామి భక్తులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజలను గురుస్వాములు సుధీర్, కుమార్, శ్రీనులతో పాటు అయ్యప్ప భక్తులు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్రవాహనాలు ఢీ..

# ఇద్దరు యువకులు దుర్మరణం

కుప్పంరూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త



కుప్పం - కృష్ణగిరి జాతీయ రహదారిలో తంబిగానిపల్లి కొటాలు సమీపంలో శనివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఇన్‌చార్జ్ ఎస్సై శివకుమార్ తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని పిబి నత్తంకు చెందిన ప్రవీణ్ (20) అదే గ్రామానికి చెందిన నితీష్ (21)తో కలసి తన ద్విచక్రవాహనంలో కుప్పం నుంచి పిబి నత_ం వెళ్తున్నాడన్నారు. అదేసమయంలో నడిమూరు పంచాయతీ తొట్లమ్మగుడి ఒనికి చెందిన అభిషేక్ (23)తన టువీలర్‌లో కుప్పం వైపు వస్తుండగా ఇద్దరి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తీవ్ర రక్తగాయాలపాలైన ప్రవీణ్, అభిషేక్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ నితీష్‌ను చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

## -ఒకరి పరిస్థితి విషమం

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 16 ప్రభాతవార్త



గాయపడ్డ బాలికను చేతుల మీద మోసుకెళుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి-వెంకటగిరి మార్గంలోని పల్లాం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలు గురు గాయపడ్డారు.వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని తిరుపతికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.రేణిగుంట మండలం కరకంబాడి చైతన్య పురానికి చెందిన శంకరయ్య (32) డక్కిలి మండలం వడ్డిపల్లికి వెళ్ళి తమ చెల్లి లక్ష్మి(28),వారి పిల్లలు హరి(4), లావణ్య (12)లను ఆటోలో పుట్టింటికి తీసుకెళుతుండగా ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయటానికి ప్రయత్నించారు. వెంకటగిరి వైపు వెళుతున్న లారిని ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వారందరూ గాయపడ్డారు. 108 అందుబాటులో లేకపోవటంతో మరొక వాహనంలో శ్రీకాళహస్తి లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన డాక్టర్లు పరిస్తితి విషమంగా ఉందని బాధితుల బంధువులకు వివరించారు. వారిలో లావణ్య పరిస్తితి విషమంగా ఉండటంతో అందరూ తిరుపతికి తరలించారు.

**దయనీయ స్థితిలో ఆసుపత్రి:**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో పరిస్థితి దయనీయంగామారింది. ఎవరైనా ప్రమాదం జరిగి తిరుపతికి వెళ్ళాలంటే అంబులెన్స్ అందుబాటులో ఉండటం లేదు. కనీసం పేషంట్‌ను వాహనం నుంచి ఆసుపత్రిలోకి తరలించుటకు స్ట్రెచర్ కూడా లేక పోవటం గమనిస్తే పేదల అసుపత్రి పరిస్థితి ఏమిటో అర్థమౌతుంది.

# అంతర్‌పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో కెఇసి విద్యార్థుల ప్రతిభ

కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త



ఇటీవల కలికిరిలో జరిగిన అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. జావెలిన్ త్రోలో ప్రణవ్ స్వర్ణపతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. షాట్‌పుట్‌లో గోవిందరాజు కాంస్యం, 400మీటర్ల రిలే పోటీల్లో గౌస్, సంతోష్,తరుణ్, హేమకేష్‌లు కాంస్యం సాధించారన్నారు.వాలీబాల్ విభాగంలో సైతంకళాశాల విద్యార్థులు బంగారుపతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, డిప్లమో ఇన్‌చార్జ్ సుబ్రమణ్యం, పిడి సతీష్‌కుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

# జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులకు బంగారుపతకాలు



గుడుపల్లె, డిసెంబర్ 16 ప్రభాతవార్త

మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ వారి అధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో గుత్తార్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యారు ్థలు చిత్రలేఖనం పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు హెచ్ఎం తెలిపారు.

# వరల్డ్ కరాటేమాస్టర్స్ ఎక్సెలెన్సీ అవార్డు అందుకున్న రెడ్డిమహేష్

పుంగనూరు,డిసెంబరు 16 ప్రభాతవార్త :



పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ రెడ్డిమహేష్ శనివారం చెన్నైలో వరల్డ్‌కరాటే మాస్టర్స్ ఎక్సెలెన్సీ అవార్డును అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 84 దేశాలలో సభ్యత్వం కలిగిన వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోషియేష్ వారు ప్రతిదేశం నుంచి సమర్థవంతులైన కరాటే మాస్టర్స్‌ను ఎంపిక చేస్తారు. పూర్తిగా వ్యక్తిగత ప్రతిభతో పాటూ వయసు,సాధించిన విజయాలు,పాల్గొన్న విభాగాలు,ఇస్తున్న సమర్థవంతమైన శిక్షణ,భవిష్యత్తు తరాల మాస్టర్స్ తయారీలో చేస్తున్న కృషి విషయాలను దృష్టిలో ఉంచుకుని ఎక్సెలెన్సీ అవార్డుకు ఎంపిక చేస్తారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌కు దక్కని ఈగౌరవంకు పుంగనూరు పట్టణానికి చెందిన మాస్టర్ రెడ్డి మహేష్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బాలమురుగన్ వద్దనుంచి ఆయన అవార్డును స్వీకరించారు. తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్యరాజన్ ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఈకార్యక్రమంలో కరాటే మాస్టర్‌గా రెడ్డిమహేష్ అవార్డు స్వీకరించారు. కరాటే మాస్టర్లకు ఎంతో గౌరవ ప్రదమైన ఈఅవార్డు పుంగనూరు కరాటే మాస్టర్‌కు రావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఈ ప్రధాన రోడ్డు మార్గానికి మోక్షం ఎప్పుడో....

## -వర్షం వస్తే రోడ్డాంతా బురద మయం
## -ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తిరుపతిరూరల్, డిసెంబర్16 ప్రభాతవార్త:

బాలాజి డైరీ నుండి 150 బై పాస్ రోడ్డుకు వెళ్ళే ప్రధాన రోడ్డు మార్గం గుంతల మయంతో వాహనదారులకు నరకం చూపిస్తుంది. వైకుంఠపురం నుండి 150 బై పాస్ రోడ్డుకు కలిసే ప్రధాన రహదారి వర్షం వస్తే బురదతో చిత్తడిగా మారిపోతుంది. ఈ రోడ్డు మార్గం గుండా డైరి పాల లారీలతో పాటు స్కూల్ బస్సులు, ప్రయాణికులు, భక్తులు ప్రయాణిస్తూ ఉంటారు. ఈ ఏర్పాటు చేసినప్పుడు నాసిరకం తారు రోడ్డు వేయడంతో కొద్దిరోజులకే మటుమయం అయిపోయి, రోడ్డంతా గుంతలతో స్వాగతం పలుకుతుంది. వైకుంఠపురం నుండి రాజీవ్‌నగర్ సబ్ స్టేషన్, గాంధీపురం గ్రామ సచివాలయం మీదగా శ్రీనగర్ కాలనీ, గరుడనగర్‌ను వైపున బాలాజి డైరీని తాకుతూ బై పాస్ రోడ్డును కలుస్తుంది. ఎక్కువ రద్దీగా వాహనాలు ప్రయాణించే ఈ ప్రధాన రహదారి ఇటు బాలాజి డైరి యాజమాన్యం, అటు గాంధీపురం గ్రామ పంచాయతీ పట్టించుకోకపోవడంతో రోడ్డున ప్రయాణించాలంటే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బాలాజీ డైరి దగ్గర నుండి బై పాస్ రోడ్డుకు సి.సి. రోడ్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.